RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:96 | మార్చి 29, 2026 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260



2లో

### ఎల్‌బీ స్టేడియంలో క్రీడా సందడి

లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

14 ఏళ్ల తర్వాత పునఃప్రారంభమైన క్రీడా సంప్రదాయం

# రాజాధి రాజా..!

## భద్రాచలంలో కనువిందు చేసిన శ్రీరామ పట్టాభిషేకం


- కల్యాణ రాముడు నుంచి పట్టాభిరాముడిగా మహిమాన్వితం
- వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆధ్యాత్మిక పరవశం
- గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పట్టు వస్త్రాల సమర్పణ
- భక్తాద్రిగా మారిన భద్రగిరి

2లో



**వేద న్యూస్, భద్రాచలం**

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో పరవశించిపోయింది. శుక్రవారం జరిగిన జగదభిరాముడి కల్యాణ మహోత్సవం తర్వాత, శనివారం అత్యంత వైభవంగా శ్రీరామ పట్టాభిషేక పర్వఘట్టం కనువిందు చేసింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ రాముడు పట్టాభిరాముడిగా దర్శనమివ్వడంతో భక్తజనం పులకించిపోయారు. ఈ అద్భుత ఘట్టానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించగా, మంత్రులు, ప్రజాప్రతినిధులు మరియు వేలాదిమంది భక్తులు స్వామివారి దివ్య రూపానికి నీరాజనాలు పలికారు. రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీట ధారియై భద్రాద్రి రామయ్య రాజాధిరాజుగా కొలువుదీరిన ఆ మహిమాన్విత వేడుక భక్తులను కనువిందు చేసింది




- నిత్యం మత్తు కోసం యువత తాపత్రయం
- విద్యాసంస్థల చెంతనే విష వలయం
- శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం
- ఆందోళన, డిప్రెషన్‌కు దారితీస్తున్న వ్యసనం
- ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలు
- వేములవాడ రూరల్ పరిధిలో ఆందోళనకర పరిస్థితులు

2లో

**వేద న్యూస్, వేములవాడ రూరల్**

ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన మత్తు సంస్కృతి, ఇప్పుడు పల్లెటూరి గడప తొక్కుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల పరిధిలో గంజాయి రక్కసి యువతను నిలువునా కబళిస్తోంది. సరదా కోసం మొదలుపెట్టి.. స్నేహితుల ఒత్తిడికి లోనై.. చివరకు ప్రాణాంతకమైన వ్యసనానికి బానిసలవుతూ తమ బంగారు భవిష్యత్తును యువత అంధకారంలోకి నెట్టేసుకుంటోంది. కేవలం గల్లీలకే పరిమితం కాకుండా, విద్యాసంస్థల చెంతనే అక్రమ దందా సాగుతుండటం తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను వణికిస్తోంది. జ్ఞాపక శక్తి మందగించడం, మానసిక కుంగుబాటు వంటి సమస్యలతో రేపటి తరం నిర్వీర్యమవుతోంది.



## మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం

- ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఆగదు
- పర్యాటక, సాంస్కృతిక కేంద్రంగా మారనున్న పరీవాహక ప్రాంతం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- చారిత్రక పుణ్యక్షేత్రాల పునర్నిర్మాణానికి శ్రీకారం
- పురాతన ఆలయాల అభివృద్ధికి భారీ ప్రణాళికలు

2లో




## భయం.. భయం..!

### మిల్స్ కాలనీలో ఎప్పుడు ఏం జరుగుతుందో?




మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులను బీర్ సీసాలతో విచక్షణా రహితంగా దాడి చేస్తున్న యువకులు

2లో

### ప్రతినిత్యం గొడవలు.. దొంగతనాలే..

- భయం.. భయంగా గడుపుతున్న స్థానికులు
- సాయంత్రం అయితే చాలు గుంపులుగా యువకులు
- కాలనీలో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- చిన్న విషయాలకే రోడ్లపై ఘర్షణలు
- కలకలం రేపుతున్న ఇద్దరు చిన్నారుల మిస్సింగ్
- రాత్రి వేళల్లో వాహనాల్లో పెట్రోల్ సైతం దొంగతనం చేస్తున్న కేటుగాళ్లు
- సిబ్బంది కొరతతో పోలీసుల నిఘా కరువు
- రాజకీయ ఒత్తిళ్లతో పైపైనే డ్యూటీలు..
- ప్రజలే సొంతంగా సీసీ కెమెరాల ఏర్పాటు
- పోలీస్ ఉన్నతాధికారులు దృష్టిసారించి నిఘా పెంచాలంటున్న స్థానికులు



## మరణంలోనూ మహోన్నతం.. ఆరుగురికి ప్రాణదానం

- నల్గొండ యువకుడి అవయవదానం సమాజానికి స్ఫూర్తి
- తల్లి మహేశ్వరి ధైర్య నిర్ణయం ప్రశంసనీయం
- ఆరుగురికి పునర్జన్మ కల్పించిన హరీష్

2లో

వేద న్యూస్

ఆదివారం | మార్చి 29, 2026

### జనసేన ఆధ్వర్యంలో

## భగవద్గీత, హనుమాన్ చాలీసా పంపిణీ

- 500 మందికి గ్రంథాల అందజేత
- ఆధ్యాత్మిక చైతన్యానికి పిలుపు



**వేద న్యూస్, వరంగల్**

వరంగల్ నగరంలోని హంటర్ రోడ్ గాయత్రీ దేవి ఆలయంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో భగవద్గీత, హనుమాన్ చాలీసా గ్రంథాలను ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లా సీనియర్ నాయకులు డా. గోళ్ళ రాజేంద్రప్రసాద్, పీఓసీ సభ్యులు గద్దం రాకేష్ నేతృత్వంలో సుమారు 500 మందికి ఈ గ్రంథాలు అందజేశారు. ఈ సందర్భంగా డా. గోళ్ళ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, భగవద్గీత మానవాళికి మార్గదర్శక గ్రంథమని, జీవితాన్ని సన్మార్గంలో నడిపించే దివ్య దిక్సూచి అని పేర్కొన్నారు. నేటి తరానికి భగవద్గీత బోధనలు అత్యవసరమని, చిన్ననాటి నుంచే పిల్లలకు ఈ విలువలను నేర్పించాలని సూచించారు. జిల్లా నాయకులు గద్దం రాకేష్ మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో భగవద్గీత ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. భవిష్యత్తులో ప్రతి దేవాలయం, ప్రతి వీధిలో ఉచితంగా పంపిణీ చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రమేష్ సురావ్, వంశీ, దయాకర్, గుండా సంతోష్, హరిధర్, మాలతి, నాగరాజు, పూర్ణ, రేవంత్, శివ, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

## రాజాధిరాజా..!

### భద్రాచలంలో కనువిందు చేసిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం

**వేద న్యూస్, భద్రాచలం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. 'కళ్యాణ రాముడు' నుంచి 'పట్టాభిరాముడు'గా అలంకరించబడిన స్వామివారి దివ్య రూపం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. శ్రీరామ జయరామ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగగా, వేద మంత్రాల నడుమ జరిగిన ఈ మహోత్సవం ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించింది. మొదటగా రామాలయంలోని భద్రుని మండపంలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య స్వామివారిని పల్లకిలో ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకువచ్చి, శిల్పకళా శోభిత మండపంపై వేంచేశారు. అర్చకులు విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి పాదుకలు, రాజదండం, రాజముద్రిక, స్వర్ణ కిరీటం, ఖడ్గం, రత్నాభరణాలను అలంకరించారు. ఈ ఆభరణాలను భక్తులకు చూపించగా, భక్తులు పరవశించిపోయారు. అనంతరం ఋగ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వవేదం, రామాయణం, విష్ణు పురాణం పారాయణాలతో వేడుక మరింత వైభవంగా సాగింది. పుష్కర నది జలాలతో మహాకుంభ తీర్థప్రోక్షణ నిర్వహించి, భక్తులపై తీర్థజలాలు చల్లారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరై స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. సారపాక హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గవర్నర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయానికి చేరుకున్న గవర్నర్ స్వామివారిని దర్శించుకుని, పట్టాభిషేకాన్ని కనులారా తిలకించారు.

## మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

ఎవరెన్ని విమర్శలు, అడ్డంకులు సృష్టించినా మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మానవ తప్పిదాల వల్ల గొప్ప చరిత్ర కలిగిన హైదరాబాద్ నగరం కనుమరుగయ్యే ప్రమాదం నుంచి కాపాడి, భవిష్యత్తు తరాలకు అత్యద్భుత నగరాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మూసీ నది శుద్ధి ప్రస్తుతం అత్యవసరమైన అంశమని, దీనిపై ఎలాంటి రాజీ ఉండదని అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా గండిపేట–మంచిరేవుల ప్రాంతంలోని చారిత్రక వీరభద్రస్వామి ప్రాంగణంలో శ్రీ మచిలేశ్వర స్వామి, శ్రీ ఓంకారేశ్వర స్వామి ఆలయాల పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి భూమిపూజ నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గోవు పూజ చేసి గోశాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆలయాల అభివృద్ధికి సంబంధించిన పూజలు, శంకుస్థాపనలు ఘనంగా జరిగాయి. సుమారు 1400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని దాదాపు 8 ఎకరాల్లో రూ.700 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఈ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనతో పాటు ఈ ప్రాంతాన్ని ధ్యానమందిరాలు, సాంస్కృతిక కట్టడాలతో ప్రత్యేక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. మూసీ నది ప్రక్షాళనను ఏ పరిస్థితుల్లోనూ ఆపబోమని, ఇది ప్రభుత్వ దీక్ష అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతాన్ని దక్షిణ కాశీగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

### మరణంలోనూ మహోన్నతం..

## ఆరుగురికి ప్రాణదానం

**వేద న్యూస్, నల్గొండ**

నల్గొండ జిల్లాకు చెందిన 25 ఏళ్ల యువకుడు బత్తిని హరీష్ అకాల మరణం తీవ్ర విషాదాన్ని కలిగించింది. రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఈ యువకుడి కథ దుఃఖంతో పాటు మానవత్వాన్ని గుర్తుచేసే ఉదాహరణగా నిలిచింది. తమ కుమారుడు ఇక లేడనే చేదు నిజాన్ని అంగీకరించడం ఎంతో కష్టమైనప్పటికీ, హరీష్ తల్లి మహేశ్వరి గుండె నిబ్బరంతో ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తన కుమారుడి అవయవాలను దానం చేసి, ఇతరులకు జీవం పోయాలని ఆమె నిర్ణయించడం అందరినీ కదిలిస్తోంది. హరీష్ కిడ్నీలు, కాలేయం, గుండె, కళ్ళు వంటి ముఖ్య అవయవాలను దానం చేయడం ద్వారా ఆరుగురు రోగులకు కొత్త జీవితం లభించింది. మరణించిన తర్వాత కూడా తన ద్వారా మరికొంతమంది జీవితాల్లో వెలుగు నింపిన హరీష్ త్యాగం నిజంగా మహోన్నతమైనదిగా నిలిచింది.

# భయం.. భయం..!


## మిల్స్ కాలనీలో ఎప్పుడు ఏం జరుగుతుందో?

### ప్రతినిత్యం గొడవలు.. దొంగతనాలే..

- భయం.. భయంగా గడుపుతున్న స్థానికులు
- సాయంత్రం అయితే చాలు గుంపులుగా యువకులు
- కాలనీలో విచ్చలవిడిగా వెలుస్తున్న బెల్ట్ షాపులు
- చిన్న విషయాలకే రోడ్లపై ఘర్షణలు
- కలకలం రేపుతున్న ఇద్దరు చిన్నారుల మిస్సింగ్
- వాహనాల్లో పెట్రోల్ సైతం దొంగతనం చేస్తున్న కేటుగాళ్లు
- సిబ్బంది కొరతతో పోలీసుల నిఘా కరువు
- రాజకీయ ఒత్తిళ్లతో పైపైనే డ్యూటీలు..
- ప్రజలే సొంతంగా సీసీ కెమెరాల ఏర్పాటు
- పోలీస్ ఉన్నతాధికారులు దృష్టిసారించి నిఘా పెంచాలంటున్న స్థానికులు



మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తులను బీర్ సీసాలతో విచక్షణ రహితంగా దాడి చేస్తున్న యువకులు



కరీమాబాద్ ప్రాంతంలో ద్విచక్ర వాహనం పార్ట్స్ ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు





కరీమాబాద్ శ్రీ సీతారామ స్వామి గుడి వీధిలో కారు అద్దాలు ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్**

వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొంతకాలంగా సంఘ విద్రోహ శక్తులు రెచ్చిపోతున్నారు. సామాన్య ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరుస దొంగతనాలు, చిన్నారుల అదృశ్యం, యువకుల ఘర్షణలతో ఈ ప్రాంతంలోని ప్రజలు భయం భయంగా బతుకుతున్నారు.





#### వరుస దొంగతనాలు.. చిన్నారుల మిస్సింగ్

మిల్స్ కాలనీ పరిధిలోని పలు డివిజన్లలో కొన్ని రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. రాత్రి పూట ఇళ్ల బయట నిద్రపోవాలన్నా భయపడాల్సిన పరిస్థితి. మరీ ముఖ్యంగా, ఒకే రోజు ఇద్దరు చిన్నారులు మిస్సింగ్ కావడం స్థానికంగా పెను కలకలం రేపింది. ఈ ఘటనతో తల్లిదండ్రులు తమ పిల్లలను బయటకు పంపాలంటేనే వణికిపోతున్నారు. చిన్నారుల ఆచూకీ కనుగొనడంలో పోలీసులు మరింత వేగంగా స్పందించాలని బాధితులు కోరుతున్నారు.

#### పెడదోవ పడుతున్న యువత

కాలనీల్లోని ప్రధాన కూడళ్ల వద్ద సాయంత్రం అయితే చాలు, యువకులు గుంపులు గుంపులుగా చేరుతున్నారు. చిన్న విషయాలకే గొడవలకు దిగడం, వాహనాలతో అతివేగంగా వెళ్లడం వంటి చర్యలతో స్థానికులకు నిద్ర లేకుండా చేస్తున్నారు. యువకుల మధ్య పెరుగుతున్న ఈ ఘర్షణలు చివరకు దాడుల వరకు వెళ్తున్నాయి. వారిని అదుపు చేసేవారు లేక వచ్చలవిడిగా రెచ్చిపోతుండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

#### బెల్ట్ షాపుల జోరు..

వీటన్నింటికీ మూల కారణం గల్లీ గల్లీలో వెలిసిన బెల్ట్ షాపులే అని స్థానికులు ఆరోపిస్తున్నారు.. మిల్స్ కాలనీ పరిధిలో అనుమతి లేని బెల్ట్ షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. తెల్లవారుజాము నుంచే మద్యం విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్ లేదా లోకల్ పోలీసులు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం మత్తులోనే యువకులు గొడవలకు దిగడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం జరుగుతోంది. తక్షణమే ఈ బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

#### ప్రజలే సెక్యూరిటీ గార్డులు!

ఒకప్పుడు రాత్రి పూట పోలీసు జీపులు సైరన్ మోగిస్తూ తిరుగుతుంటే ప్రజలకు ధైర్యంగా ఉండేది. కానీ ఇప్పుడు మిల్స్ కాలనీ పరిధిలో పెట్రోలింగ్ ఊసే లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల నిఘా లేకపోవడంతో నేరగాళ్లకు అడ్డుఅదుపు లేకుండా పోయింది. పోలీసుల కోసం వేచి చూసి విసిగిపోయిన పలు కాలనీల ప్రజలు.. ఇప్పుడు తమ సొంత ఖర్చులతో, చందాలు వేసుకుని మరీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రజలే తమ భద్రతను తాము చూసుకుంటున్నారు.

#### స్టాఫ్ కొరత.. రాజకీయ ఒత్తిళ్లు..

మిల్స్ కాలనీ స్టేషన్‌లో జనాభా నిష్పత్తికి తగ్గట్టుగా సరిపడా పోలీస్ సిబ్బంది లేకపోవడం ఒక ప్రధాన సమస్యగా మారింది. ఉన్న కొద్దిమంది సిబ్బందిపై పనిభారం పెరగడంతో అన్ని ప్రాంతాలపై నిఘా పెట్టలేకపోతున్నారు. దీనికి తోడు రాజకీయ ఒత్తిళ్లు పోలీసుల పనితీరును దెబ్బతీస్తున్నాయి. ఏదైనా కేసులో కఠినంగా వ్యవహరించాలని చూస్తే స్థానిక నాయకుల నుంచి ఫోన్ కాల్స్ వస్తున్నాయని సమాచారం. పోలీసులకు స్వేచ్ఛనిచ్చి, రాజకీయ ప్రమేయం లేకుండా చేస్తేనే ఇక్కడ శాంతిభద్రతలు మెరుగుపడతాయని పలువురు సూచిస్తున్నారు.

#### హత్యలు జరిగే అవకాశం

ప్రస్తుతం జరుగుతున్న దొంగతనాలు, గొడవలను ఇప్పుడే అదుపు చేయకపోతే భవిష్యత్తులో ఇవి హత్యలు, పెద్ద ఎత్తున దోపిడీలకు దారితీసే ప్రమాదం ఉందని మేధావులు, స్థానికులు హెచ్చరిస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారికి ఈ ప్రాంతం ఒక సురక్షిత స్థావరంగా మారుతోందని, వెంటనే గాలింపు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



మిల్స్ కాలనీ పరిధి శివనగర్ ప్రాంతంలో ఈ నెల 22వ తేదీన ద్విచక్ర వాహనం నుంచి అర్ధరాత్రి పెట్రోల్ దొంగలిస్తున్న దుండగులు



ఈ నెల 23వ తేదీన ఓ ఇంట్లో సాయంత్రం వేళ చొరబడి సుమారు రూ.15 వేల నగదు,వెండి పట్టీలతో పాటు బీరువాలోని విలువైన పత్రాలను దొంగలించిన దుండగులు





ఇటీవల కనిపించకుండా పోయిన కరిమాబాద్‌కి చెందిన యజ్ఞశ్రీ, మణికంఠ

# సరదాగా మొదలై.. బానిసలై..!

**వేద న్యూస్, వేములవాడ రూరల్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల పరిధిలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకూ పెరిగిపోతుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఈ వ్యసనం, ఇప్పుడు పల్లెల్లోని యువతను కూడా తన కోరల్లోకి తీసుకుంటోంది. సరదాగా మొదలయ్యే ఈ అలవాటు, చివరకు వారి బంగారు భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తోంది.

#### ఆకర్షణ నుంచి బానిసత్వం వరకు..

ప్రస్తుత రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం, స్నేహితుల ఒత్తిడి లేదా కొత్త అనుభవాల కోసం యువకులు గంజాయి వంటి మత్తు పదార్థాల వైపు ఆకర్షితులవుతున్నారు. పరిశోధనల ప్రకారం, మొదట కేవలం ఉత్సుకతతో ప్రారంభించిన వారు, క్రమంగా దానికి పూర్తిగా బానిసలుగా మారుతున్నారు. ఈ వ్యసనం వల్ల వారు తమ చదువును, ఉద్యోగ అవకాశాలను మరియు కుటుంబ బాధ్యతలను పూర్తిగా విస్మరిస్తున్నారు. లక్ష్యాలను మరిచిపోయి జీవితంలో వెనుకబడిపోతున్న యువకుల సంఖ్య ఈ ప్రాంతంలో పెరగడం కలవరపెట్టే అంశం.

#### శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

మత్తు పదార్థాల వినియోగం కేవలం వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, అది ఒక ప్రాణాంతక వ్యాధిగా మారుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గంజాయి వాడటం వల్ల జ్ఞాపకశక్తి మందగించడమే కాకుండా, విపరీతమైన ఆందోళన, కుంగుబాటు వంటి మానసిక సమస్యలు తలెత్తుతాయి. ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు రావడం, చిన్న విషయాలకే ఆగ్రహానికి గురికావడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇది శాశ్వత మానసిక వికలాంగత్వానికి కూడా దారితీసే ప్రమాదం ఉందని వైద్యులు వివరిస్తున్నారు.

#### విద్యాసంస్థల చెంతనే అక్రమ దందా!

మరో విచారకరమైన విషయం ఏమిటంటే, విద్యాసంస్థల పరిసరాలే కేంద్రంగా మత్తు పదార్థాల అక్రమ వ్యాపారం సాగుతోంది. గంజాయి విక్రయించే ముఠాలు అమాయక విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని తమ నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నాయి. పాఠశాలలు, కళాశాలల సమీపంలో ఈ తరహా కార్యకలాపాలు సాగుతుండటం వల్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భయాందోళనలకు గురవుతున్నారు. పోలీసులు నిరంతరం దాడులు నిర్వహిస్తూ నిందితులను పట్టుకుంటున్నప్పటికీ, ఈ సరఫరా గొలుసును పూర్తిగా తెంచడం ఒక పెద్ద సవాలుగా మారింది.

### యువతను కబళిస్తున్న గంజాయి రక్కసి

- నిత్యం మత్తు కోసం యువత తాపత్రయం
- విద్యాసంస్థల చెంతనే విష వలయం
- శారీరక, మానసిక ఆరోగ్యంపై ప్రభావం
- ఆందోళన, డిప్రెషన్‌కు దారితీస్తున్న వ్యసనం
- ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలు
- వేములవాడ రూరల్ పరిధిలో ఆందోళనకర పరిస్థితులు



#### కలిసి పోరాడితేనే పరిష్కారం

ఈ మహమ్మారిని అరికట్టడానికి కేవలం చట్టం మాత్రమే సరిపోదని, సామాజిక బాధ్యత కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను నిరంతరం గమనిస్తూ, వారితో స్నేహపూర్వకంగా మెలగాలి. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన సదస్సులు నిర్వహించాలి. సమాజం, పోలీస్ యంత్రాంగం మరియు కుటుంబ వ్యవస్థ కలిసికట్టుగా పోరాడితేనే మన యువతను ఈ మత్తు ఊబి నుంచి బయటకు తీసుకురాగలమని మేధావులు స్పష్టం చేస్తున్నారు.

## ఎల్‌బీ స్టేడియంలో క్రీడా సందడి

- లెజిస్లేటర్స్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం
- 14 ఏళ్ల తర్వాత పునఃప్రారంభమైన క్రీడా సంప్రదాయం

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న ఎల్‌బీ స్టేడియంలో తెలంగాణ లెజిస్లేటర్స్ స్పోర్ట్స్, కల్చరల్ మీట్ తొలి ఎడిషన్ ఘనంగా ప్రారంభమైంది. 'ఫిట్ లీడర్స్ – ఫిట్ స్టేట్' అనే సందేశంతో ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనమండలి, శాసనసభ సభ్యులకు నిర్వహించే ఈ క్రీడలు గత 14 సంవత్సరాలుగా నిలిచిపోయిన నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వాటిని మళ్లీ ప్రారంభించారు. కార్యక్రమాన్ని ప్రారంభించడమే కాకుండా సహచర మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి పలు క్రీడల్లో స్వయంగా పాల్గొని అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్‌బీ స్టేడియంకు గొప్ప చరిత్ర ఉందని, ప్రపంచ స్థాయి క్రీడాకారులు ఇక్కడ ఆడినట్టు గుర్తు చేశారు. ఈ స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. అలాగే గచ్చిబౌలి క్రీడా మైదానాలను రూ.700 కోట్లతో ప్రపంచ స్థాయి సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు.

# ఆశ వర్కర్ల అరెస్టులు అన్యాయం

- నిర్బంధాలతో ఉద్యమాలను ఆపలేరు
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ
- హామీలు అమలు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్




**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

ఆశా వర్కర్లపై పోలీసుల ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు చేయడం అన్యాయమని సిఐటియు రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి కోడం రమణ తీవ్రంగా ఖండించారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మార్చి 28న నిర్వహించిన చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ మహాధర్నాను అడ్డుకోవడానికి జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆశా వర్కర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారని ఆయన తెలిపారు. సిరిసిల్లలోని సుందరయ్య నగర్, అంబేద్కర్ నగర్ పీహెచ్‌సీలకు చెందిన ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడంతో, వారిని పరామర్శించిన కోడం రమణ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్ వేతనం, పని భద్రత కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. ఆశా వర్కర్లకు రావలసిన పారితోషికాలు కూడా సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని ప్రభుత్వం చెబుతూనే, శాంతియుతంగా ధర్నాకు వెళుతున్న ఆశా వర్కర్లను అడ్డుకోవడం అన్యాయమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో స్పందించి అసెంబ్లీ బడ్జెట్‌లో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టైన వారిలో లావణ్య, చంద్రకళ, రజిత, నిర్మల, మమత, లక్ష్మి, గీత, స్వప్న, జ్యోతి, బాలలక్ష్మి, అనిత తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ స్థలంలో గుడి నిర్మాణంపై విభేదాలు

- కొంతమంది అడ్డుకుంటున్నారని తండా వాసుల ఆరోపణలు
- డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతి పత్రం

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాలో ప్రభుత్వ స్థల వినియోగంపై వివాదం నెలకొంది. సుమారు 18 ఏళ్ల క్రితం ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలో ప్రస్తుతం అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ, కొత్తగా గుడి నిర్మాణంపై విభేదాలు తలెత్తాయి. గ్రామపంచాయతీ తీర్మానం మేరకు ఆ స్థలంలో పంచాయతీ భవనం, మహిళా సంఘం భవనం, శుద్ధి చేసిన నీటి ప్లాంట్ నిర్మించాలని నిర్ణయించగా, కొంతవరకు పనులు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో తండా వాసులు సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి ముందుకు రాగా, గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దీనికి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తండాలో సుమారు 120 కుటుంబాలు ఉండగా, వాటిలో 20 కుటుంబాలు మాత్రమే గుడి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించి తండా వాసుల అభిప్రాయాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతి పత్రం అందజేశారు. అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

# డాక్టర్ అనితా రెడ్డికి రాణి రుద్రమదేవి అవార్డు

- సామాజిక సేవలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక పురస్కారం
- అంజలీ మీడియా గ్రూప్స్ ఉగాది అవార్డులలో ఎంపిక



**వేద న్యూస్, హనుమకొండ**

వరంగల్‌కు చెందిన అంజలీ మీడియా గ్రూప్స్ సంస్థ, అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు మరియు వరల్డ్ వైడ్ కన్జ్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డిని కాకతీయ వీర నారి రాణి రుద్రమదేవి అవార్డు-2026కు ఎంపిక చేసినట్లు సంస్థ నిర్వాహకులు కామిశెట్టి రాజు పటేల్ తెలిపారు. గత 30 సంవత్సరాలుగా అనాథలు, దివ్యాంగులు, మహిళలు, వృద్ధులు, అంధులకు సేవలు అందిస్తూ రక్తదానం, వైద్య శిబిరాలు, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆమె సేవలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ, ఈ ప్రతిష్టాత్మక అవార్డు తన సేవలకు లభించిన గొప్ప గుర్తింపని, దీంతో తన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. భవిష్యత్తులో మరింత సేవా కార్యక్రమాలు చేపట్టి అవసరార్థులకు అండగా నిలుస్తానని పేర్కొంటూ అంజలీ మీడియా గ్రూప్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# సిల్వర్ జూబ్లీ ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

- మున్సిపల్ కార్మిక సంఘం 25 ఏళ్ల సేవలకు వేడుకలు
- ఏప్రిల్ 22, 23న ఘనంగా నిర్వహణ



**వేద న్యూస్, కరీంనగర్:**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆవరణలో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటియు) సిల్వర్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ, యూనియన్ స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏప్రిల్ 22, 23 తేదీలలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల విజయానికి ప్రతి ఒక్కరూ ఆర్థిక, హార్దిక సహకారం అందించాలని కోరారు. మున్సిపల్ కార్మికులు సానిటేషన్, నీటి సరఫరా, హరితహారం, విద్యుత్, వీధి దీపాలు, టౌన్ ప్లానింగ్ వంటి విభాగాల్లో ప్రజా సేవలో నిరంతరం పనిచేస్తున్నారని, కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తించారని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం కృషి చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నిరంతరం పోరాడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కవ్వంపెల్లి రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపల్లి పోచయ్య, కార్పొరేషన్ కమిటీ నాయకులు, మహిళా కమిటీ సభ్యులు, ఇతరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్ విరాళం

- నర్సమ్మ జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమం

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెట్లపెల్లి బాలకృష్ణయ్య, నర్సమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులు సుమారు రూ.70 వేల విలువైన కంప్యూటర్ ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. గత 14 సంవత్సరాలుగా ప్రతి ఏడాది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, ఆట వస్తువులు, అన్నప్రసాదం పంపిణీ చేస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు, ఈసారి పాఠశాల అభివృద్ధికి తోడ్పడేలా ప్రింటర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ వాణి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు కుటుంబ సభ్యుల సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో చెట్లపెల్లి నరేందర్ కుటుంబ సభ్యులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకం

- లైంగిక నేరాల కేసుల్లో రాజకీయ రక్షణ
- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని పిలుపు




**వేద న్యూస్, హనుమకొండ:**

బీజేపీ పాలిత ప్రాంతాల్లో మహిళల భద్రత దెబ్బతింటోందని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. బీజేపీకి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలపై అత్యాచారం, లైంగిక వేధింపుల కేసులు ఉన్నప్పటికీ వారికి రాజకీయ రక్షణ కల్పిస్తున్నారని విమర్శించారు. మహిళల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని, "బేటీ బచావో, బేటీ పడావో" వంటి కార్యక్రమాలపై భారీగా ఖర్చు చేసినప్పటికీ, వాస్తవ పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలమైందని పేర్కొన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో జరిగిన ఘటనలను ఉదాహరణగా చూపిస్తూ, మహిళలపై పెరుగుతున్న నేరాలపై కేంద్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. కొన్ని ప్రముఖ కేసుల్లో నిందితులకు రాజకీయ అండ లభిస్తున్నట్లు కనిపిస్తోందని, ఇది ఆందోళన కలిగించే అంశమని ఆమె పేర్కొన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై ప్రభుత్వ స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఈ నేపథ్యంలో మహిళల రక్షణ, హక్కుల కోసం ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పత్రికా సమావేశాలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, నాయకులు బంక సరళ, సునావత్ రాధా తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 7న గోశాలలో కోడెల పంపిణీకి ఏర్పాట్లు

- సన్నకారు రైతులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్



**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**

వచ్చే నెల (ఏప్రిల్) 7వ తేదీన వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ గోశాలలో కోడెల పంపిణీ నిర్వహించనున్నట్లు సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. గోశాలలో మధ్యస్థం నుంచి పెద్ద పరిమాణంలో ఉన్న సుమారు 300 కోడెలను మంగళవారం ఉదయం 7 గంటలకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ పంపిణీకి సిరిసిల్ల జిల్లా తో పాటు ఉమ్మడి కరీంనగర్ మరియు పరిసర జిల్లాల రైతులు అర్హులని తెలిపారు. 1.5 నుంచి 5 ఎకరాల వరకు సాగు భూమి కలిగిన సన్నకారు, చిన్నకారు రైతులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్ కార్డు, వ్యవసాయ అధికారుల ధృవపత్రాలతో అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులు సంబంధిత పత్రాలతో ఏప్రిల్ 7న తిప్పాపూర్ గోశాలకు హాజరుకావాలని సూచించారు. అర్హులైన రైతులకు మాత్రమే జియో ట్యాగింగ్ కలిగిన కోడెలను పంపిణీ చేస్తామని తెలిపారు. జియో ట్యాగింగ్ విధానం ద్వారా కోడెల పర్యవేక్షణ సులభమవుతుందని, వాటి దుర్వినియోగం నివారించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. కోడెలను తీసుకున్న రైతులు వాటి సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అక్రమంగా తరలించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు..

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

- మడికొండ ఔటర్ రింగ్ రోడ్డుపై ఘటన

**వేద న్యూస్, మడికొండ:**



మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని టేకులగూడెం గ్రామం వద్ద ఔటర్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. ఈ నెల 26వ తేదీ సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు సుమారు 6065 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, భిక్షాటన చేసుకునే వ్యక్తిగా భావిస్తున్నారు. ఆమె మానసిక స్థితి కూడా సరిగా లేనట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు నైటీ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మడికొండ పోలీసులు వెల్లడించారు. వృద్ధురాలి వివరాలు తెలిసిన వారు 8712685009, 8712685248, 8712685123 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

వేద న్యూస్
ఆదివారం మార్చి 29, 2026

# వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ @70

## సాంకేతిక విద్యకు చిరునామా..

- ప్లాటినం జూబ్లీ వేడుకలకు సిద్ధమైన ప్రతిష్టాత్మక విద్యాసంస్థ
- వేలాది ఇంజినీర్లకు మార్గదర్శకంగా నిలిచిన కళాశాల
- పూర్వ విద్యార్థుల మహాసమ్మేళనం ప్రధాన ఆకర్షణ



ఇ. వి. శ్రీనివాస్ రావు
అధ్యక్షులు



మేకల అక్షయ్ కుమార్
ప్రధాన కార్యదర్శి




**వేద న్యూస్, హనుమకొండ:**

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తన స్థాపనకు 70 సంవత్సరాలు పూర్తి చేసుకుని ప్లాటినం జూబ్లీ వేడుకలను మార్చి 29న ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమైంది. సాంకేతిక విద్యలో విశిష్ట గుర్తింపు పొందిన ఈ విద్యాసంస్థ, చిన్న స్థాయిలో ప్రారంభమై నేడు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుకు దారి చూపుతున్న మహావృక్షంగా ఎదిగింది. ప్రారంభ దశలో అజంజాహి మిల్లులోని ఒక షెడ్డులో కేవలం 120 మంది విద్యార్థులతో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సులతో ప్రారంభమైన ఈ కళాశాల, తరువాత విస్తరించి ఈసీఈ, కంప్యూటర్ కోర్సులు కూడా ప్రవేశపెట్టింది. ప్రస్తుతం 10 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన క్యాంపస్‌లో 1600కు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

**ఎందరో అత్యున్నత స్థానినికి..**

ఈ కళాశాల నుంచి చదువుకున్న విద్యా ర్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధి కారులుగా, శాస్త్రవేత్తలుగా, ఇంజినీర్లుగా దేశ విదేశాల్లో కీలక స్థానాలను అధిరోహించారు. బీహెచ్ఈఎల్, హెచ్ఏఎల్, డీఆర్డీవో, ఇస్రో వంటి ప్రముఖ సంస్థల్లో సేవలందిస్తూ కళాశాలకు కీర్తి తెచ్చారు. సుమారు 20 వేల మందికి పైగా విద్యార్థులు ఇక్కడి నుంచి సాంకేతిక విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. కళాశాల గ్రంథాలయంలో 25 వేలకుపైగా పుస్తకాలు ఉండగా, ఎంసెట్, పాలిసెట్ వంటి ప్రవేశ పరీక్షల కౌన్సిలింగ్ కేంద్రంగా కూడా ఇది నిలుస్తోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఐఎస్‌వో గుర్తింపు పొందడం కళాశాలకు మరింత గౌరవం తీసుకువచ్చింది.

ప్లాటినం జూబ్లీ వేడుకల సందర్భంగా దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహాసమ్మేళనం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతిష్టాత్మక పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఈవీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. కళాశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్ కూడా పూర్వ విద్యార్థులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# సిటీ కళాశాలలో ముగిసిన ఏఐ శిక్షణ

- ఐసీటీ అకాడమీ-ఐబీఎం భాగస్వామ్యంతో నాలుగు రోజుల కార్యక్రమం



**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, మ్యాథమెటిక్స్ విభాగాలు సంయుక్తంగా నిర్వహించిన నాలుగు రోజుల 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఐసీటీ అకాడమీ మరియు ఐబీఎం భాగస్వామ్యంతో ఈ ప్రతిష్టాత్మక శిక్షణను నిర్వహించారు. మారుతున్న సాంకేతిక ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి రంగాల్లో పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా సాగింది. ఈ శిక్షణను కళాశాల అధ్యాపకులు ప్రొ. జె.వి.ఎన్. మల్లికార్జున్, డా. శారద, డా. నాగేశ్వర్, శ్రవణ్, సంతోష్ సమన్వయం చేశారు. ఐసీటీ అకాడమీకి చెందిన నిపుణులు ముకుంద్, సంతోష్, ఆదర్శ్ శిక్షణ తరగతులను నిర్వహిస్తూ ఐబీఎం టెక్నాలజీ ఫ్రేమ్‌వర్క్‌పై విద్యార్థులకు లోతైన అవగాహన కల్పించారు. శిక్షణ ముగింపు సందర్భంగా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తూ, ఈ కార్యక్రమం ద్వారా సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలపై స్పష్టత వచ్చిందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను వాస్తవ ప్రపంచంలో ఎలా వినియోగించాలో నేర్చుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యుయేసి సమన్వయకర్త ప్రొ. నీరజ మాట్లాడుతూ, ఐబీఎం, ఐసీటీ అకాడమీ వంటి సంస్థలతో భాగస్వామ్యం విద్యార్థుల అకడమిక్ నైపుణ్యాలు మరియు పరిశ్రమ అవసరాల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గిస్తుందని, భవిష్యత్తులో ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఘనంగా ఎన్ఎస్ఎస్ వీడ్కోలు వేడుకలు




- జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన వలంటీర్లకు సన్మానం

**వేద న్యూస్, హైదరాబాద్:**

హైదరాబాద్ ప్రభుత్వ సిటీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ. సిహెచ్. ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సమాజంలోని సమస్యలను పరిష్కరించడంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. సిటీ కళాశాల విద్యార్థులు ఎల్లప్పుడూ సామాజిక సేవలో ముందుంటారని, అదే సేవాభావాన్ని భవిష్యత్తులోనూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయి క్యాంపులు, శిబిరాల్లో పాల్గొని కళాశాలకు పేరు తీసుకువచ్చిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న సంస్వతి, అదిబా, రాంచందర్, మల్లికార్జున స్వామి, సాహస శిబిరంలో పాల్గొన్న అజయ్ కుమార్, రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న రాజేశ్వరిని అభినందించారు. అలాగే వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వాలంటీర్లకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టు కున్నాయి. ఈ కార్యక్రమంలో డా. ఎల్. తిరుపతి, డా. కృష్ణచంద్ర కీర్తి, డా. శ్రీదేవి, డా. సుదక్షణ, డా. రవీంద్రబాబు, డా. నాగరాజు తదితర అధ్యాపకులు, సుమారు 150 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# ప్రారంభమైన హనుమాన్ మండల దీక్షలు

- వేద మంత్రాలు, భజనల మధ్య ఆధ్యాత్మిక వాతావరణం



**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి శ్రీ సీతారామాలయంలో 41 రోజుల హనుమాన్ మండల దీక్షలు గురువారం భక్తిపూర్వకంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణం మొత్తం జపధ్వనులు, మంగళవాద్యాలు, హనుమద్భక్తుల నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. మూడు చెక్కలపల్లె గ్రామానికి చెందిన గురుస్వామి ఆసం శేషు ఆధ్వర్యంలో ఐదుగురు స్వాములు మండల దీక్షను స్వీకరించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండ కృష్ణస్వామి వేదమంత్రాల నడుమ మాలధారణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. హనుమాన్ దళం సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వాములకు ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ.. హనుమంతుడి ఆశీస్సులతో గ్రామంలో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం నిర్వహించిన సీతారాముల ప్రత్యేక పూజలు, హనుమాన్ చలీసా పారాయణం ఆలయాన్ని మరింత పుణ్యమయంగా మార్చాయి. గ్రామస్తులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మండల దీక్షలో భాగంగా వచ్చే 41 రోజులపాటు భజనలు, పూజలు, సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి



**వేద న్యూస్, రుద్రూర్ :**

బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూరు, కోటగిరి, పొతంగల్ మండలాలల్లో వరి కోతలు మొదలైన సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతస్థాయి పర్యటన చేశారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు విధానాన్ని తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వము కొనుగోలు కేంద్రాన్ని (గవర్నమెంట్ కాంటాను) ప్రారంభించకపోవడంతో రైతులు దళారుల వద్ద తీవ్రంగా నష్టపోతున్నారనీ విచారం వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టు బాటు ధర రాక ఒక్క క్వింటాకు 300 నుంచి 400 రూపాయల వరకు నష్ట పోతున్నారని, రైతుల గోషను గమనించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపీ కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, నియోజకవర్గ సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్, వడ్లసాయినాథ్, గుంజరి జగదీష్, కమ్మరి శివశంకర్, మామిడి శ్రీనివాస్, సాయిలు, సీనియర్ నాయకులు జీలకర్ర విజయ్, గణేష్ పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంబంలో హనుమాన్ స్వాముల శోభాయాత్ర



**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని అంబం (ఆర్) గ్రామంలో శనివారం హనుమాన్ స్వాములు శోభాయాత్ర నిర్వహించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిక్ష దాత గంగలి సావిత్రి హనుమాన్ స్వాములకు బిక్ష ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భజనలు, కీర్తనలతో డీజే చప్పులతో శోభయాత్ర కొనసాగింది. అదేవిధంగా అంబం గ్రామం నుండి కొండగట్టు వరకు హనుమాన్ స్వాములు మంత్రి దత్తు, శానంశ్రవణ్, గణేష్, ప్రణయ్, ఆర్.గంగాధర్, గోపి, ఆర్. రాజు స్వాములు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ శోభయాత్రలో హనుమాన్ స్వాములు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య సంరక్షణ కోసం ఆహార నియమాలు పాటించాలి



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

- డాక్టర్ హైదర్

నేటి పరిస్థితుల్లో ఆరోగ్య సంరక్షణ కొరకు ఆహార నియమాలు పాటించాలని డాక్టర్ హైదర్ అన్నారు. న్యూశాయంపేట జాగీర్ పొచంపల్లి పరిధిలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, వరంగల్ వెస్ట్ ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇనుగాల రాధిక ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం 5వ రోజు ఆరోగ్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హైదర్, హెల్త్ సూపర్ వైజర్ మరియా థామస్, శ్రీదేవి, వైద్య సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు మరియు గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో ఆహార నియమాలు పాటించాలని, ఆరోగ్యమే అసలైన సంపదని, కావున యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే శారీరక, మానసిక ఆరోగ్యం కలిగి ఉండాలన్నారు. మితాహారం, వ్యాయామంతో శరీరం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని, ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీ. పి.ఎస్ హెచ్.ఎమ్ జి ఉప్పలయ్య, సోని , త్రివేణి, శ్వేత, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలిరావాలి

**వేద న్యూస్, రుద్రూర్ :**

రుద్రూర్ మండల కేంద్రంలోని శశిరేఖ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో ఆదివారం ఉదయం 10 గంటలకు హిందూ సమ్మేళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రుద్రూర్, బొప్పాపూర్, వీరాపురం, అంబం (ఆర్) గ్రామాల ఆధ్వర్యంలో జరుపుకునే హిందూ సమ్మేళన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా శ్రీ నర్ర వెంకట శివకుమార్, ముఖ్య అతిథులుగా శ్రీశ్రీశ్రీ సద్గురు మహాదేవ్ స్వామీజీ (మహాదేవ ధర్మపీఠం గుడి మెట్) కామారెడ్డి జిల్లా నుంచి ధర్మబోధన చేయటానికి వస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, భోజన సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, యువకులు, యువతులు, మహిళలు, తప్పనిసరిగా హాజరుకావాలని వారు పేర్కొన్నారు.

## కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతో నష్టపోతున్న రైతులు

వేద న్యూస్, కోటగిరి :



కోటగిరి, పొతంగల్ మండలాలల్లో వరి కోతలు ప్రారంభం అయిన సందర్భంగా బీజేపీ నియోజకవర్గ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతస్థాయి పర్యటన చేశారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించకపోవడంతో రైతులు దళారుల వద్ద తీవ్రంగా నష్టపోతున్నాని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర రాక ఒక్క క్వింటాకు 300 నుంచి 400 రూపాయల వరకు నష్టపోతున్నారని, రైతుల గోసను గమనించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వము కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనియెడల రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, బీజేపీ కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండల అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, నియోజకవర్గ సీనియర్ నాయకులు మార్కెలి ప్రకాష్ పటేల్, వడ్ల సాయినాథ్, గుంజరి జగదీష్, కమ్మరి శివశంకర్, మామిడి శ్రీనివాస్, సాయిలు, సీనియర్ నాయకులు జీలకర్ర విజయ్, గణేష్ పటేల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల ఆస్తి పన్నుల చెల్లింపులపై దృష్టి సారించండి

**– హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్**

వేద న్యూస్, కాశీబుగ్గ :



ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల చెల్లింపుల పై దృష్టి సారించి వసూళ్లు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్/ బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం వరంగల్ పరిధి లోని కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ–సేవా కేంద్రం తో పాటు వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పన్ను వసూళ్ల విధానాన్ని పరిశీలించి సమర్థవంతం గా చేపట్టుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ సర్కిల్ కార్యాలయ ఆవరణ లో గల ఈ–సేవా కేంద్రం లో ఆకస్మికంగా సందర్శించి పన్నుల సేకరణ తీరును, ప్రభుత్వ ఆస్తుల బిల్లుల చెల్లింపు తదితర అంశాలను అడిగి తెలుసుకొని మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నగర పరిధి లోని బకాయి లు పడి ఉన్న రైల్వే, పోస్టాఫీసులు, కే ఎం సి తదితర ప్రభుత్వ కార్యాలయాల కు నోటీసులు అందజేసి వెంటనే పన్నులు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, రెవెన్యు అధికారులు రావుల ఆనంద్, శ్రీనివాస్, ఆర్ఐ సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

## కళాశాల మైదానాన్ని మినీ స్టేడియంగా మార్చాలి

వేద న్యూస్ , కారేపల్లి :



సింగరేణి మండల కేంద్రంలోని క్రీడాకారుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని ఆట స్థలాన్ని సకల సౌకర్యాలతో కూడిన మినీ స్టేడియంగా అభివృద్ధి చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేదరి టోనీ మాట్లాడుతూ, మండలంలోని గ్రామీణ క్రీడాకారుల్లో అద్భుతమైన ప్రతిభ దాగి ఉందని, అయితే సరైన వసతులు లేక వారు వెనుకబడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల మైదానాన్ని మినీ స్టేడియంగా తీర్చిదిద్దితే, అది యువతకు మెరుగైన శిక్షణ వేదికగా మారుతుందని, క్రీడల్లో రాణించేందుకు దోహదపడుతుందని వివరించారు సర్పంచ్ విన్నపాన్ని పరిశీలించిన అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. మైదానాభివృద్ధికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని, వెంటనే నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, పంచాయతీ రాజ్ పిఆర్ ఏఈ రాజశేఖర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నెహ్రూ, మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# 'ఉపాధి'లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**– సిరిసిల్లలో 50 రోజులు కూడా పని కల్పించలేకపోయారు**

**– ప్రతి కుటుంబానికి 125 రోజులు పని కల్పించాలి**

**– కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్**

వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:



జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం విఫలమవుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. సిరిసిల్ల జిల్లాలో 92 వేల జాబ్ కార్డులు ఉన్నప్పటికీ, సగటున 50 రోజులకు కూడా పనిదినాలు కల్పించలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ఏటా 125 రోజుల పని కల్పించేలా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో రూ.25 లక్షలతో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, ముస్తాబాద్‌లో రూ.10 లక్షలతో రోడ్ల పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. 2026–27 బడ్జెట్‌లో వీబీజీ రామ్–జీ పథకానికి రూ.95,692 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా తెలంగాణకు రూ.3 వేల కోట్లకు పైగా నిధులు వచ్చే అవకాశముందని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను విడుదల చేయడంలో జాప్యం చేస్తోందని విమర్శించారు. పంచాయతీలు, మున్సిపాలిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తగిన నిధులు ఇవ్వడంలేదని, కేంద్రంపై విమర్శలు చేయడం మాత్రమే అలవాటైందని ఆరోపించారు. అలాగే రైతులకు ఎరువుల సరఫరాలో కూడా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డిపల్లెలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## రెవెన్యూ యోధుడు అనంతుల రమేష్‌కు ఘన వీడ్కోలు

వేద న్యూస్, కారేపల్లి :



సింగరేణి మండల తహసిల్దారుగా తనదైన ముద్ర వేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేసిన అనంతుల రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా శనివారం ఆయనను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ఆయనను కల్లూరు మండలంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఏ ఓగా నియమించడంతో, తోటి అధికారులు ఆయన సేవలను కొనియాడుతూ వీడ్కోలు పలికారు. సింగరేణి మండల ఎంపీడీవో పొన్నూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. అనంతుల రమేష్ కి శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. సింగరేణి మండలంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని, కొత్త బాధ్యతల్లో కూడా ఆయన విజయవంతం కావాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కారేపల్లి నూతన తహసిల్దార్ ఎమ్మార్వో వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా పాల్గొని అనంతుల రమేష్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండల స్థాయి అధికారులు ఒకచోట చేరి, ఎమ్మార్వో రమేష్ తో ఉన్న పని అనుభవాలను పంచుకోవడం ఈ కార్యక్రమానికి మరింత శోభను చేకూర్చింది. సన్మాన గ్రహీత అనంతుల రమేష్ మాట్లాడుతూ.. సింగరేణి మండల ప్రజల సహకారం, తోటి అధికారుల సమన్వయం వల్లే తాను విజయవంతంగా విధులు నిర్వహించగలిగానని తెలిపారు. ఇప్పుడు కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏఓగా బాధ్యతలు చేపడుతున్నందుకు సంతోషంగా ఉందని, పాలనను మరింత వేగవంతం చేసేలా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆకస్మిక తనిఖీ!



**– విద్యార్థులతో కలిసి భోజనం.. మెనూ అమలుపై ఆరా**

**– గేట్ రేలకాయలపల్లి హాస్టల్‌లో అధికారుల పరుగులు!**

వేద న్యూస్, కారేపల్లి :

మండల కేంద్రంలోని గేట్ రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాల హాస్టల్‌ను శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎవరికీ ముందస్తు సమాచారం లేకుండా నేరుగా పాఠశాలకు చేరుకున్న ఆమె, హాస్టల్ నిర్వహణ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ఆకస్మిక పర్యటనతో ఒక్కసారిగా అధికార యంత్రాంగం ఉలిక్కిపడింది. తనిఖీలో భాగంగా అడిషనల్ కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందుతుందా? లేదా? అని స్వయంగా పరిశీలించారు. వంట గదిలో పరిశుభ్రతను, నిల్వ ఉన్న సరుకుల నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి, చదువు ఎలా సాగుతోంది? భోజనం బాగుందా? ఇతర ఇబ్బందులేమైనా ఉన్నాయా? అని ఆత్మీయంగా అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వసతులకు ఆదేశం హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించకూడదని వార్డెన్ మరియు సిబ్బందిని ఆమె ఆదేశించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంతో పాటు, వసతి గృహాల్లో లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. అధికారుల పర్యవేక్షణ ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ తో పాటు స్థానిక అధికారులు మరియు హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు. ఉన్నతాధికారి స్వయంగా వచ్చి క్షేత్రస్థాయిలో పరిస్థితులను సమీక్షించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

వేద న్యూస్, చొప్పదండి:



**– సర్పంచ్ భాగ్యలక్ష్మి రాజన్న**

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోందని గంగాధర గ్రామ సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి రాజన్న తెలిపారు. శనివారం గంగాధర గ్రామంలో ముద్రకోల రాజేశ్వరిహన్మండ్లు కుటుంబం నిర్మించుకున్న నూతన ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రత్యేక పూజల్లో పాల్గొని, లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు నూతన వస్త్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, దశాబ్దాలుగా గూడు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం వరంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. తమ సొంతింటి కల నెరవేరడమే కాకుండా, సర్పంచ్ స్వయంగా హాజరై గౌరవించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## కారేపల్లి తహశీల్దార్‌గా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

**– ఆనంతుల రమేష్‌కు ఘన వీడ్కోలు**

వేద న్యూస్,కారేపల్లి :



సింగరేణి మండల తహశీల్దార్‌గా పనిచేసిన ఆనంతుల రమేష్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా, మండల కేంద్రంలో శనివారం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఇదే క్రమంలో మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓరుగంటి వెంకటేశ్వర్లుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు భూక్యా రంజిత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. బదిలీపై వెళ్తున్న ఆనంతుల రమేష్ మండల అభివృద్ధికి అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. నూతన ఎమ్మార్వో ఓరుగంటి వెంకటేశ్వర్లు ఆయనను శాలువాతో కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌ల సంఘం తరపున రంజిత్ కుమార్ మాట్లాడుతూ.. మండల సమస్యల పరిష్కారంలో తహశీల్దార్ల సహకారం ఎంతో కీలకమని, నూతన అధికారికి తమ పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఓరుగంటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండల పరిధిలోని భూ సమస్యల పరిష్కారానికి, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 29, 2026

# సమగ్ర భూ రీ సర్వే (నక్ష) పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



**-కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాల పరిష్కారం, యాజమాన్య హక్కుల నమోదు కోసం చేపట్టిన సమగ్ర భూ రీ సర్వే (నక్ష) కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. శనివారం వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలోని భవానీకుంట తండాలో వివిధ శాఖల అధికారులతో పాటు సర్వే బృందాల సహకారంతో జిల్లా కలెక్టర్ పంట పొలాల్లో నేరుగా పర్యటించారు. ఈ సందర్భంగా సర్వే జరుగుతున్న భూముల సరిహద్దులు, కొలతలు మరియు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమగ్ర భూ సర్వేలో భాగంగా జియో కోఆర్డినేట్లు, డ్రోన్ సర్వే మరియు మ్యాపింగ్ సాంకేతికతలను వినియోగించి భూముల హద్దులను ఖచ్చితత్వంతో, ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. పైలట్ ప్రాజెక్ట్ కింద వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలో నక్ష సర్వే చేపట్టి భూముల హద్దులు, మ్యాపింగ్ పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు. సర్వేలో పాల్గొంటున్న అధికారులు, సిబ్బంది ఆయా భూములకు సంబంధించిన వివరాలను ఖచ్చితం గా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం వర్ధన్న పేట ఎంపీడీవో కార్యాలయం లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నక్ష సర్వేను సమర్థ వంతంగా, వేగవంతం గా పూర్తి చేయడానికి పలు సూచనలు చేశారు. మున్సిపల్ పరిధిలోని 10,240 ఎకరాల వ్యవసాయ భూమిలో 6,379 ఎకరాలకు రీ సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. అలాగే మొత్తం 4,652 ఇండ్లకు గాను సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని 158 బ్లాకులలో 102 బ్లాకుల్లో రీ సర్వే పూర్తయినట్లు తెలిపారు. మిగతా బ్లాకుల్లో కొనసాగుతున్న సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా భూముల కొలతల శాఖ అధికారి శ్రీనివాసులు, ఆర్డీవో సుమ, తహసిల్దార్ విజయ్ సాగర్, ఎంపీడీవో వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ సుధీర్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- టెక్స్టైల్ పార్కులో శిక్షణ, యూనిఫాం తయారీ యూనిట్ల పరిశీలన**

**వేద న్యూస్, తంగళ్లపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలంలోని టెక్స్టైల్ పార్కులో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శనివారం పరిశీలించారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన మహిళలకు ఈ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందుతున్న మహిళలతో కలెక్టర్ మాట్లాడి, వారు ఎక్కడి నుంచి వచ్చారు, ఎన్ని రోజులుగా శిక్షణ పొందుతున్నారు, ఏ విధమైన నైపుణ్యాలు నేర్పిస్తున్నారు వంటి అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కుట్టు శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి సాధించాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను యూనిఫాంలు, దుస్తులు మరియు ఇతర వస్త్రాల తయారీలో ఉపయోగించి ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం టెక్స్టైల్ పార్కులోని యూనిట్లలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫాం క్లాత్ తయారీ ప్రక్రియను పరిశీలించారు. ఉత్పత్తి పనులు ఎప్పటిలోగా పూర్తి అవుతాయో అధికారులను అడిగి తెలుసుకుని, త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, ఎంపీఓ మీర్జా, శాఖాధికారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళకు రక్తదానం

**- మానవత్వంతో స్పందించిన యువశక్తి ఫౌండేషన్**



**వేద న్యూస్, వనపర్తి:**

ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళకు రక్తదానం చేసి ప్రాణం నిలబెట్టిన యువశక్తి ఫౌండేషన్ సభ్యులు మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. గోపాలపేట మండలం కేశంపేట గ్రామానికి చెందిన శివరాణి గర్భసంచి ఆపరేషన్ కోసం వనపర్తి ఏరియా ఆసుపత్రిలో చేరగా, అధిక రక్తస్రావం కారణంగా తక్షణమే ఏ పాజిటివ్ రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. బ్లడ్ బ్యాంకులో రక్తం అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కాగితాల మధును సంప్రదించగా, వెంటనే స్పందించిన ఆయన డోనర్లు రాకేష్, శివలను సంప్రదించి రక్తదానం చేయించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు కాగితాల మధు మాట్లాడుతూ, రక్తదానం ప్రాణదానం అని పేర్కొంటూ, ఆరోగ్యవంతమైన యువతీ యువకులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసి ప్రాణాన్ని కాపాడిన యువశక్తి ఫౌండేషన్ సభ్యులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# మాదిగలు ఐక్యతతో ముందుకు సాగాలి

**- ఐక్య వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం**



**వేద న్యూస్, వనపర్తి:**

వనపర్తి జిల్లా కేంద్రంలో మాదిగల ఐక్య వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాదిగ కులానికి చెందిన ప్రజా ప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దాచ సులోచన కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కదిరే కృష్ణ, మాజీ మంత్రి డాక్టర్ మోత్కుపల్లి నర్సిములు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధికారి డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, అదనపు డీజీపీ (వీఆర్ఎస్) గువ్వల బాలరాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మాదిగ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్లు ఈ సందర్భంగా సన్మానించబడ్డారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేస్తున్న ప్రజా ప్రతినిధులను గౌరవించడం సమాజ గౌరవాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. డాక్టర్ కదిరే కృష్ణ మాట్లాడుతూ సమాజంలో చదువుకే అత్యంత ప్రాధాన్యం ఉందని, విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఎన్నికైన ప్రజా ప్రతినిధులు ఆత్మగౌరవంతో పని చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఇతర వక్తలు మాదిగలు ఐక్యతతో ముందుకు సాగాలని, భవిష్యత్తులో రాజకీయంగా మరింత బలపడేందుకు ప్రతి ఒక్కరూ ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సామాజిక కార్యకర్తలు, మాదిగల ఐక్య వేదిక సభ్యులు పెద్దింటి వెంకటేష్, గంధం పరంజ్యోతి, మంద రాములు, మీసాల రాము, చిట్యాల తిరుపతి, వడ్డేమాన్ రవి, దారపోగు నాగరాజు, రాజనగరం రాజేష్, గంధం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం

**- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**- కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**



**వేద న్యూస్, మహబూబ్‌నగర్:**

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హన్వాడ మండలానికి చెందిన 84 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను గడప దాకా చేరుస్తున్నామని తెలిపారు. గతంలో రేషన్ కార్డుల పంపిణీలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శిస్తూ, ఇప్పుడు అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, వడ్డీలేని రుణాలు వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. త్వరలో అర్హత గల ప్రతి ఆడబిడ్డకు రూ. 2500 ఆర్థిక సాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. రైతులకు పెట్టుబడి సాయం, రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసినట్లు పేర్కొన్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీకి ఆశీస్సులు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు వి. మహేందర్, కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్నయ్య, యాదిరెడ్డి, టంకర కృష్ణయ్య యాదవ్, రఘుపతి రెడ్డి, యాదయ్య గౌడ్, వెంకటయ్య, కేశవులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కురుమూర్తి స్వామి గుట్టల పరిరక్షణకు సంతకాల సేకరణ



**- క్రషర్ ఏర్పాటు నిలిపివేయాలని అధికారులకు వినతి**

**వేద న్యూస్, చిన్న చింతకుంట:**

చిన్న చింతకుంట ప్రాంతంలోని శ్రీ కురుమూర్తి స్వామి గుట్టల పరిరక్షణ కోసం భక్తులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుట్టల మధ్య ప్రకృతి, జీవ వైవిధ్యం, ఆధ్యాత్మిక విలువలు నిండిన ఈ క్షేత్రానికి క్రషర్ ఏర్పాటు ముప్పుగా మారిందని ఆలయ పరిరక్షణ కమిటీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. కురుమూర్తి స్వామి దేవస్థానం భక్తుల ఇలవేల్పు దైవమని, ఏడు కొండలతో ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతంలో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం క్రషర్ ఏర్పాటు చేసి గుట్టలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. శేషాద్రి గుట్ట (తిప్పగుట్ట) వద్ద బ్లాస్టింగ్ కార్యకలాపాలు చేపట్టడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గుట్టల పరిరక్షణ కోసం భక్తులంతా కలసి జిల్లా ఉన్నత అధికారులకు వినతి పత్రం అందజేయడానికి సంతకాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. క్రషర్ ఏర్పాటును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో సహకరించాలని శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ పరిరక్షణ సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు.

## హైవేపై కారులో మంటలు.. పూర్తిగా దగ్ధం



**వేద న్యూస్ యాదాద్రి:**

యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం పరిధిలో జైన్ కంపెనీ సమీపంలో కేపాల్ వద్ద ఓ కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. TS 03 EN 6575 నంబర్ గల ఈ కారు వరంగల్ నుంచి హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.కారు ఇంజిన్ నుంచి మంటలు రావడాన్ని గమనించిన కారు యజమాని అప్రమత్తమై వాహనం ఆపి, అందులో నుంచి దిగడంతో ప్రాణాపాయం తప్పింది. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. కానీ మంటలు వేగంగా వ్యాపించడంతో కారు మాత్రం పూర్తిగా దగ్ధమైంది.

వేద న్యూస్

ఆదివారం మార్చి 29, 2026

# టెండర్ల రద్దు వెనుక కారణం ఏంటి?

- కమిషన్ల కోసం చీకటి ఒప్పందాలే కారణం
- అనుమానాలు వ్యక్తం చేసిన సీపీఐ నేతలు



**వేద న్యూస్, కరీంనగర్:**

నగరపాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాల అభివృద్ధి పనుల కోసం మంజూరైన టెండర్లను రాత్రికి రాత్రే రద్దు చేయడం వెనుక ఉన్న కారణాలను వెల్లడించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. టెండర్లను పునరుద్ధరించాలని కోరుతూ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రభుత్వం విలీన గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసి, సుమారు 87 అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచిందని తెలిపారు. అయితే కొత్త పాలకవర్గం ఏర్పడ్డ తర్వాత ఆ టెండర్లను గుట్టు చప్పుడు కాకుండా రద్దు చేయడం అనుమానాలకు తావిస్తోందని అన్నారు. విలీన గ్రామాల అభివృద్ధిని పక్కనబెట్టి కమిషన్ల కోసం టెండర్లను రద్దు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు కలిసి ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. ప్రజల అభివృద్ధిపై మంత్రులకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే టెండర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నగరంలో టెండర్ల రద్దుపై వివాదం కొనసాగుతున్నా సంబంధిత మంత్రులు స్పందించకపోవడంపై వారు ప్రశ్నలు లేవనెత్తారు. వెంటనే టెండర్లను తిరిగి అమల్లోకి తీసుకువచ్చి పనులు ప్రారంభించాలని, లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు సర్దార్ వల్లభాయ్ పటేల్, నగర నాయకులు మామిడిపల్లి హేమంత్, బాకం అంజన్న, శ్రీనివాస్ గౌడ్, రమేష్, ఎల్లయ్య, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

- లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: డీఎంహెచ్ఓ



**వేద న్యూస్, ముస్తాబాద్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి (డీఎంహెచ్ఓ) డాక్టర్ రజిత శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లను సందర్శించి, రికార్డులు, స్కానింగ్ యంత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ... స్కానింగ్ సెంటర్లు నిబంధనల ప్రకారం 'ఫారం-ఎఫ్' రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీల పూర్తి వివరాలు, వారి సంతకాలు నమోదు చేయడంతో పాటు స్కానింగ్‌కు సంబంధించిన ఫిలింను తప్పనిసరిగా జతపరచాలని సూచించారు. గర్భంలో ఉన్న శిశువు లింగాన్ని నిర్ధారించడం చట్టరీత్యా నేరమని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా లింగ నిర్ధారణ సమాచారం ఇస్తే సంబంధిత సెంటర్లను వెంటనే సీజ్ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.10 వేల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశముందని తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ లేకుండా ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తే క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో మహేష్ గౌడ్, నవీన తదితరులు పాల్గొన్నారు.

# మందమర్రిలో కాస్మోటాలజీ శిక్షణ పూర్తి

- అభ్యర్థులకు సర్టిఫికెట్లు
- సింగరేణి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో కార్యక్రమం
- 31 మందికి శిక్షణ  మహిళలకు ఉపాధి అవకాశాలు
- స్వయం ఉపాధి దిశగా ముందడుగు

**వేద న్యూస్ మందమర్రి:**

మందమర్రిలోని సింగరేణి సంస్థ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో నిర్వహించిన కాస్మోటాలజీ కోర్సును పూర్తి చేసిన అభ్యర్థులకు శనివారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, మందమర్రి సేవ అధ్యక్షురాలు శ్రీవాణి రాధాకృష్ణ పాల్గొన్నారు. 15 రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణలో మొత్తం 31 మంది అభ్యర్థులు పాల్గొని కాస్మోటాలజీ రంగంలో ప్రావీణ్యం సాధించారు. శిక్షణ అనంతరం వారికి సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ముఖ్యంగా మహిళలకు ఉపాధి అవకాశాలు విస్తరించాయని అధికారులు పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా వారు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగేందుకు ఈ శిక్షణ దోహదపడిందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా



ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్యాలు అందించడం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యమని చెప్పారు. శిక్షణ పొందిన అభ్యర్థులు ఈ అవకాశంపై సంతోషం వ్యక్తం చేస్తూ, తమ భవిష్యత్తుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా ఈ కార్యక్రమం మహిళల సాధికారతకు తోడ్పడుతూ, ఉపాధి అవకాశాలను పెంపొందించే దిశగా కీలక పాత్ర పోషిస్తోంది.

# నిరుద్యోగ యువతకు సింగరేణి ఉచిత శిక్షణ



**వేద న్యూస్ రామగుండం:**

- ఉపాధి దిశగా అడుగు
- వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్‌లో శిక్షణ
- 651 మందికి శిక్షణ, 130 మందికి ఉద్యోగాలు
- రామగుండం టిటిసిలో కార్యక్రమం విజయవంతం

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సింగరేణి సంస్థ చేపట్టిన ఉచిత శిక్షణ కార్యక్రమం ఫలితాలను ఇస్తోంది. రామగుండం-1 ఏరియాలోని టిటిసిలో వోల్వో డంప్ ట్రక్ డ్రైవింగ్‌లో యువతకు శిక్షణ అందిస్తూ, వారికి ఉద్యోగ మార్గాలను చూపిస్తోంది. ఇప్పటివరకు 13 బ్యాచీలలో మొత్తం 651 మంది యువకులు ఈ శిక్షణ పొందారు. వీరిలో 130 మంది ఇప్పటికే వివిధ సంస్థల్లో ఆపరేటర్లుగా ఉద్యోగాలు పొందడం విశేషం. ఈ శిక్షణ ద్వారా యువతలో నైపుణ్యాలు పెరిగి, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతున్నాయి. తాజాగా నెలరోజుల శిక్షణను పూర్తి చేసిన మరో 49 మందికి ఏరియా జీఎం లలిత్ కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. శిక్షణ పొందిన యువతకు ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ చేపట్టిన ఈ కార్యక్రమం యువత సాధికారతకు దోహదపడుతోంది. ఉద్యోగ అవకాశాలు పెరగడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడే అవకాశముందని అధికారులు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంపై యువత ఆనందం వ్యక్తం చేస్తూ, ఇలాంటి అవకాశాలను కల్పించిన సింగరేణి సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా ఈ కార్యక్రమం నిరుద్యోగ సమస్య పరిష్కారానికి దోహదపడుతూ, నైపుణ్యాభివృద్ధి ద్వారా యువతకు కొత్త దారులు చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

# గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

- అగ్రహారం శివారులో అక్రమ సాగు వెలుగులోకి



**వేద న్యూస్, వేములవాడ:**


రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని అగ్రహారం గ్రామ శివారులో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం, ఉత్తరప్రదేశ్‌కు చెందిన అచ్చే లాల్ అనే వ్యక్తి గంజాయి మొక్కలను పెంచుతున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, అక్కడ సాగు చేస్తున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఇంచార్జ్ ఇన్స్పెక్టర్ తెలిపారు. సకాలంలో స్పందించి గంజాయి సాగును బయటపెట్టిన ఎస్సై శ్రీనివాస్, పిసి మహిపాల్, పిసి సంతోష్, హోంగార్డ్ ఆనంద్‌లను డీఎస్పీ ఏ. శ్రీనివాసులు అభినందించారు. ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరిస్తూ, గంజాయి సాగు, రవాణా, విక్రయం లేదా వినియోగం వంటి అక్రమ చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## భారతీయ రంగస్థల, సినీ ధృవతార..

# ఉత్పల్ దత్ జయంతి

- బహుముఖ ప్రజ్ఞాశాలిగా భారతీయ చిత్రసీమలో చెరగని ముద్ర
- సమాంతర సినిమా మరియు వాణిజ్య చిత్రాల మధ్య వారధి
- నాటక రచయితగా, దర్శకుడిగా సామాజిక చైతన్యానికి ప్రతీక

**వేద న్యూస్ డెస్క్:**



భారతీయ చలనచిత్ర రంగంలోనూ, ముఖ్యంగా బెంగాలీ నాటక రంగంలోనూ తనదైన ముద్ర వేసిన అద్భుత నటుడు, రచయిత ఉత్పల్ దత్ జయంతిని పురస్కరించుకుని కళాలోకం ఆయనను స్మరించుకుంటోంది. 1929 మార్చి 29న జన్మించిన ఉత్పల్ దత్, కేవలం ఒక నటుడిగానే కాకుండా ఒక గొప్ప మేధావిగా, మార్క్సిస్టు సిద్ధాంతకర్తగా కూడా గుర్తింపు పొందారు. ఆయన నటనలో ఉన్న గాంభీర్యం, సంభాషణల చాతుర్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసేవి. ముఖ్యంగా అమితాబ్ బచ్చన్ నటించిన 'సాత్ హిందుస్తానీ' వంటి చిత్రాల ద్వారా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, తన జీవితాంతం కళను సమాజ శ్రేయస్సు కోసం అంకితం చేశారు. ఉత్పల్ దత్ నటనా ప్రస్థానం ఇంగ్లీష్ థియేటర్‌తో ప్రారంభమైనప్పటికీ, కాలక్రమేణా ఆయన భారతీయ మూలాల్లోకి చొచ్చుకుపోయారు. సత్యజిత్ రే, మృణాల్ సేన్ వంటి దిగ్గజ దర్శకుల చిత్రాల్లో నటించి అంతర్జాతీయ ఖ్యాతి గడించారు. అదే సమయంలో 'గోల్ మాల్', 'నరం గరం', 'రంగీలా' వంటి హాస్య ప్రధాన చిత్రాల్లో ఆయన పండించిన హాస్యం అజరామరం. గంభీరమైన విలన్ పాత్రల నుండి కడుపుబ్బ నవ్వించే కామెడీ పాత్రల వరకు ఆయన పోషించని పాత్ర లేదు. నటనలో ఆయన చూపిన వైవిధ్యం నేటి తరం నటులకు ఒక గొప్ప పాఠ్యపుస్తకం అనడంలో ఎలాంటి సందేహం లేదు.

రచయితగా ఉత్పల్ దత్ కలం ఎప్పుడూ పదునుగానే ఉండేది. సమాజంలోని అసమానతలు, రాజకీయ అవినీతి మరియు సామాన్యుల కష్టాలపై ఆయన అనేక నాటకాలు రచించారు. 'టిన్ తల్వార్' వంటి ఆయన నాటకాలు బెంగాలీ రంగస్థలంపై విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చాయి. ఆయన రచనల్లో అణగారిన వర్గాల గొంతు వినిపించేది. కళ అనేది కేవలం వినోదం కోసం మాత్రమే కాదు, అది ప్రజలను చైతన్యపరిచే ఒక ఆయుధం అని ఆయన బలంగా నమ్మేవారు. అందుకే ఆయన నాటక ప్రదర్శనలు తరచుగా వివాదాలకు దారితీసినప్పటికీ, ఆయన తన సిద్ధాంతాల నుండి ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు.

భారత ప్రభుత్వం ఆయన ప్రతిభను గుర్తించి జాతీయ ఉత్తమ నటుడు అవార్డుతో సత్కరించింది. సినిమా రంగంలో ఎంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించినప్పటికీ, ఆయనకు నాటక రంగంపై ఉన్న మక్కువ మాత్రం తగ్గలేదు. 'పీపుల్స్ లిటిల్ థియేటర్' ద్వారా ఆయన అనేక మంది యువ కళాకారులను తీర్చిదిద్దారు. వీధి నాటకాల ద్వారా సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడంలో ఆయన అగ్రగామిగా నిలిచారు. సినిమా గ్లామర్ కంటే రంగస్థల క్రమశిక్షణే మిన్న అని ఆయన భావించేవారు. ఆయన చూపిన బాటలో నేటికీ అనేక నాటక సంస్థలు ప్రయాణిస్తూ ఉండటం విశేషం.

ఉత్పల్ దత్ కేవలం నటుడిగానే కాక, రాజకీయ విశ్లేషకుడిగా కూడా తన గళాన్ని వినిపించేవారు. రాజకీయ నేపథ్యం ఉన్న పాత్రలను పోషించేటప్పుడు ఆయన చూపే సహజత్వం అద్భుతంగా ఉండేది. సమాజంలో మార్పు రావాలంటే కళాకారులు బాధ్యతాయుతంగా ఉండాలని ఆయన నిరంతరం ప్రభోదించేవారు. విదేశీ భాషా నాటకాలను భారతీయ పరిసరాలకు అనుగుణంగా మలచడంలో ఆయనది అందెవేసిన చేయి.

ఆయన చేసిన అనువాదాలు మరియు రూపాంతరాలు నేటికీ నాటక రంగ విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. ఆయనలోని హాస్య చతురత గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ముఖ్యంగా హృషికేష్ ముఖర్జీ దర్శకత్వంలో వచ్చిన చిత్రాల్లో ఉత్పల్ దత్ పోషించిన 'భవాని శంకర్' వంటి పాత్రలు తరతరాల ప్రేక్షకులను అలరిస్తూనే ఉన్నాయి. కఠినమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా నటిస్తూనే, లోలోపల అమాయకత్వాన్ని ప్రదర్శించడం ఆయనకే చెల్లింది. వాణిజ్య సినిమాల్లో ఉంటూనే నాటక రంగానికి తన సంపాదనను వెచ్చించి, ఎందరో పేద కళాకారులకు అండగా నిలిచిన గొప్ప మనసు ఆయనది.

వేద న్యూస్

ఆదివారం మార్చి 29, 2026

## నాగార్జునకు జోడీగా ఐశ్వర్య రాజేష్..?




**వేద న్యూస్ డెస్క్:**

కింగ్ నాగార్జున తన 100వ చిత్రాన్ని భారీగా ప్లాన్ చేస్తున్న నేపథ్యంలో హీరోయిన్ ఎంపికపై ఆసక్తికర చర్చలు మొదలయ్యాయి. ఈ సినిమాలో ఆయనకు జోడీగా ఐశ్వర్య రాజేష్ నటించనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గతేడాది 'కుబేర', 'కూలీ' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన నాగార్జున, ఈ సినిమాల్లో నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపించడం విశేషం. ముఖ్యంగా విలన్‌గా ఆయన నటనకు మంచి స్పందన వచ్చినప్పటికీ, అభిమానులు మాత్రం నాగ్‌ను మళ్లీ పూర్తి స్థాయి హీరోగా చూడాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో దర్శకుడు రా కార్తీక్‌తో కలిసి నాగార్జున ఓ కొత్త సినిమా చేయడానికి సిద్ధమయ్యారు. 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో 100వ సినిమాగా ఉండటంతో మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమాలో సీనియర్ నటి టబు నటిస్తారనే వార్తలు వినిపించగా, ఇప్పుడు హీరోయిన్‌గా ఐశ్వర్య రాజేష్ పేరు బలంగా వినిపిస్తోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో వెంకటేశ్ సరసన నటించి మంచి గుర్తింపు పొందిన ఐశ్వర్య, ఇప్పుడు నాగార్జునకు జోడీగా ఎంపికయ్యారనే టాక్ చక్కర్లు కొడుతోంది. తెలుగమ్మాయి అయినప్పటికీ తమిళంలో ఎక్కువ సినిమాలు చేసిన ఐశ్వర్య రాజేష్, ఇటీవల తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటోంది. అయితే 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత పెద్దగా ఆఫర్లు రాకపోవడంతో, నాగార్జున 100వ సినిమాలో అవకాశం వస్తే అది ఆమెకు గోల్డెన్ ఛాన్స్‌గా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ఈ వార్తలపై అధికారిక ప్రకటన ఇంకా రాలేదు. త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారని సమాచారం. నాగార్జున 100వ సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ ఎంపికతో పాటు మిగతా నటీనటుల వివరాలు బయటకు వస్తే ఈ సినిమా మరింత హైప్ అందుకోవడం ఖాయం.

# ఆ సినిమా పైనే ఆశలు పెట్టుకున్న వైష్ణవి..

**వేద న్యూస్ డెస్క్:**

సోషల్ మీడియా ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినీ రంగంలో అడుగుపెట్టిన కొత్త తరం హీరోయిన్లలో వైష్ణవి చైతన్య ఒకరు. యూట్యూబ్ వీడియోలు, షార్ట్ ఫిలిమ్స్‌తో ప్రారంభమైన ఆమె ప్రయాణం, ఇప్పుడు టాలీవుడ్‌లో గుర్తింపు పొందిన హీరోయిన్ స్థాయికి చేరుకుంది. తన సహజమైన నటన, ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్స్‌తో తక్కువ సమయంలోనే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది. కెరీర్ ప్రారంభంలో చిన్న పాత్రలతో కనిపించిన వైష్ణవి, తర్వాత హీరోయిన్‌గా అవకాశాలు అందుకుని తన ప్రతిభను చాటుకుంది. ముఖ్యంగా బేబీ సినిమా ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. సాయి రాజేష్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ఆనంద్ దేవరకొండ హీరోగా నటించగా, వైష్ణవి తన పాత్రతో ప్రేక్షకులను కట్టిపడేసింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించడంతో ఆమెకు ఒక్కసారిగా స్టార్ ఇమేజ్ వచ్చింది. 'బేబీ' విజయంతో వైష్ణవి కెరీర్ మరింత ఊపందుకుంటుందని అందరూ భావించారు. నిర్మాతలు, దర్శకులు ఆమెతో సినిమాలు చేయడానికి ముందుకు వస్తారని అనుకున్నారు. అయితే ఆ తర్వాత వచ్చిన లవ్ మీ సినిమా మాత్రం ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. కథ, కథనం ఆశించిన స్థాయిలో లేకపోవడం వల్ల ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. దీంతో వైష్ణవి కెరీర్ కొంతవరకు స్లో అయింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆమె నటిస్తున్న 'ఎపిక్' సినిమా అత్యంత కీలకంగా మారింది. ఈ ప్రాజెక్ట్‌పై వైష్ణవి చాలా ఆశలు పెట్టుకున్నట్లు సమాచారం. షూటింగ్ వేగంగా కొనసాగుతుండగా, ఈ సినిమా ద్వారా మరోసారి తన ప్రతిభను నిరూపించుకోవాలని ఆమె కృషి చేస్తోంది. ఈ చిత్రం హిట్ అయితే ఆమె కెరీర్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉంది. పెద్ద బ్యానర్లు, స్టార్ హీరోల సరసన అవకాశాలు రావడానికి ఇది మంచి ప్లాట్‌ఫామ్ అవుతుంది. ఇకపోతే, ఈ సినిమా కూడా ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోతే మాత్రం వైష్ణవికి మరోసారి కష్టకాలం ఎదురయ్యే అవకాశముంది. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఒక ఆందోళనకర అంశంగా మారింది. అందుకే ఈ ఒక్క సినిమాపైనే ఆమె పూర్తి ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో మాత్రం వైష్ణవి చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ తన ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తూ అభిమానులతో టచ్‌లో ఉంటుంది. గ్లామర్ లుక్స్‌తో పాటు సంప్రదాయ దుస్తుల్లోనూ కనిపిస్తూ యువతను ఆకట్టుకుంటోంది. ఆమె ఫాలోయింగ్ కూడా రోజురోజుకు పెరుగుతోంది. మొత్తానికి, ఒకే సినిమా ఒక నటికి ఎంత కీలకమో ఇప్పుడు వైష్ణవి పరిస్థితి చూస్తే అర్థమవుతుంది. 'ఎపిక్' సినిమా ఫలితం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చే అవకాశం ఉంది. హిట్ అయితే స్టార్ హీరోయిన్‌గా ఎదిగే అవకాశం ఉంది. లేకపోతే మళ్లీ అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి రావచ్చు. ఇప్పుడు అందరి దృష్టి ఈ సినిమా మీదే నిలిచింది.



# బరిలోకి వరుణ్ తేజ్.. తెలుగులోనే సత్తా చూపిస్తానన్న డైరెక్టర్




**వేద న్యూస్ డెస్క్:**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి యువ దర్శకుడు యదు వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. పూజా కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించగా, ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ క్లాప్ కొట్టడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా హాజరైనందుకు పవన్ కళ్యాణ్‌కు వరుణ్ తేజ్ కృతజ్ఞతలు తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించడంతో ఆ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు యదు వంశీ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి. స్పోర్ట్స్ డ్రామాలు అంటే మలయాళ సినిమాల వైపు చూసే పరిస్థితి ఉందని, కానీ తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా బలమైన కంటెంట్‌తో గొప్ప సినిమాలు తీసే సామర్థ్యం ఉందని ఆయన స్పష్టం చేశారు. మన సంస్కృతి, మన భావోద్వేగాలను ప్రతిబింబించేలా 'బరి' సినిమాను రూపొందిస్తున్నామని తెలిపారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, ఈసారి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. గ్రామీణ నేపథ్యం, క్రీడా స్ఫూర్తి, భావోద్వేగాలతో ఈ సినిమా ప్రేక్షకులను కొత్త అనుభూతికి గురి చేస్తుందని చిత్ర యూనిట్ నమ్మకం వ్యక్తం చేస్తోంది. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వరుణ్ తేజ్ నిహారిక కొణిదెల యదు వంశీ కాంబినేషన్‌లో వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

## వెంకటేష్, కల్యాణ్‌రామ్‌తో అనిల్ రావిపూడి కొత్త మల్టీస్టారర్..!



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో వరుస విజయాలతో తనదైన ముద్ర వేసుకుంటున్న స్టార్ డైరెక్టర్ అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఆయన, ఈసారి ఇద్దరు స్టార్ హీరోలను ఒకే తెరపైకి తీసుకురావడం ద్వారా భారీ మల్టీస్టారర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ సినిమాలో విక్టరీ హీరో వెంకటేశ్, నందమూరి హీరో కల్యాణ్ రామ్ ప్రధాన పాత్రల్లో నటించనున్నట్లు అధికారికంగా వెల్లడైంది.

ఈ వార్త బయటకు రావడంతోనే సినీ వర్గాల్లో భారీ ఆసక్తి నెలకొంది. వెంకటేశ్ తన కామెడీ టైమింగ్, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ప్రేక్షకులను అలరించడంలో దిట్ట కాగా, కల్యాణ్ రామ్ యాక్షన్, ఎమోషనల్ పాత్రల్లో ప్రత్యేక గుర్తింపు పొందాడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రావడం ఇదే తొలిసారి కావడంతో అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. సంక్రాంతి సీజన్ అంటే ఫ్యామిలీ సినిమాలకు మంచి వేదిక. ముఖ్యంగా అనిల్ రావిపూడి సినిమాలు ఈ సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలు సాధించిన ట్రాక్ రికార్డ్ ఉంది. అందుకే ఈ మల్టీస్టారర్‌ను కూడా అదే సీజన్‌లో తీసుకురావాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

నిర్మాణ విషయానికి వస్తే, ప్రముఖ నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. అలాగే సురేశ్ ప్రొడక్షన్స్, అర్చన సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రానికి జీ స్టూడియోస్ సహనిర్మాతగా వ్యవహరిస్తోంది. ఈ స్థాయి బ్యానర్ల భాగస్వామ్యం సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది.

ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన వర్కింగ్ టైటిల్‌ను ఫిక్స్ చేసినట్లు సమాచారం. అయితే అధికారిక టైటిల్‌ను త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది. కథ పరంగా చూస్తే, పూర్తి స్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, వినోదంతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇస్తూ తెరకెక్కించనున్నట్లు చిత్ర యూనిట్ చెబుతోంది. అనిల్ రావిపూడి స్టైల్‌కు తగ్గట్టుగా కామెడీ, ఎమోషన్, యాక్షన్ మేళవింపుతో సినిమా ఉండనుందని టాక్ వినిపిస్తోంది.

ఇది వెంకటేశ్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో ఐదో సినిమా కావడం విశేషం. గతంలో వీరి కలయికలో వచ్చిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు సాధించాయి. ఇద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, టైమింగ్ ఈసారి కూడా సినిమాకు ప్లస్ అవుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

అదే సమయంలో కల్యాణ్ రామ్తో 'పటాస్' తర్వాత అనిల్ రావిపూడి చేస్తున్న రెండో సినిమా కావడంతో ఈ కాంబినేషన్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. 'పటాస్' సినిమా కల్యాణ్ రామ్ కెరీర్‌లో ఒక పెద్ద హిట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అదే డైరెక్టర్‌తో ఆయన చేస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది.

# మళ్లీ అదే రచ్చ..

# అనుష్క పెళ్లిపై ట్రోల్స్ వైరల్..!

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి వ్యక్తిగత జీవితం, ముఖ్యంగా ఆమె పెళ్లి గురించి వస్తున్న వార్తలు మరోసారి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారాయి. ఏ చిన్న విషయం జరిగినా పెళ్లి వార్తలతో ముడిపెట్టడం కొత్తేమీ కాదు కానీ, ఈసారి మాత్రం పాత ఫోటో ఆధారంగా కొత్త రూమర్స్ సృష్టించడం అభిమానులను అసహనానికి గురిచేస్తోంది. 'బాహుబలి' సినిమాతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న అనుష్క, ఆ తర్వాత తన కెరీర్‌ను ఆచితూచి ముందుకు తీసుకెళ్తోంది. వరుస సినిమాల కన్నా కథకు ప్రాధాన్యం ఇచ్చే పాత్రలనే ఎంచుకుంటూ వస్తోంది. 'భాగమతి'తో సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఆకట్టుకున్న ఆమె, 'నిశ్శబ్దం'తో మాత్రం ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. తరువాత వచ్చిన 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి'లో ఆమె పాత్రకు మంచి స్పందన వచ్చినా, బాక్సాఫీస్ పరంగా పెద్ద హిట్ కాలేదు. ఇక ఇటీవల విడుదలైన 'ఘాటీ' సినిమా నిరాశపరిచడంతో, ఆమె తదుపరి ప్రాజెక్ట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఇదే సమయంలో, అనుష్క పెళ్లిపై పుకార్లు మళ్లీ తెరపైకి వచ్చాయి. గతంలో ఆమె ఓ స్టార్ హీరోతో ప్రేమలో ఉందని, పెళ్లి కూడా ఫిక్స్ అయిందని వార్తలు వచ్చాయి. మరికొన్ని సందర్భాల్లో ఓ బిజినెస్‌మ్యాన్‌తో వివాహం జరగబోతోందని ప్రచారం జరిగింది. అయితే ప్రతి సారి కూడా అవి కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోయాయి. ఇప్పుడేమో, సోషల్ మీడియాలో ఒక ఫోటో వైరల్ అవుతోంది. అందులో అనుష్క ఒక వ్యక్తి చేతిని పట్టుకుని నడుస్తున్నట్టు కనిపిస్తోంది. ఈ ఫోటోను ఆధారంగా తీసుకుని "నిశ్చితార్థం అయిపోయింది", "పెళ్లి ఫిక్స్ అయింది" అంటూ నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ కూడా ఈ విషయాన్ని సెన్సేషన్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ అసలు నిజం ఏమిటంటే, ఆ ఫోటో ఇప్పటి దాని కాదు. అది 2016లో జరిగిన ఒక ఫ్యాషన్ షోలో తీసిన స్టిల్ మాత్రమే. ఆ సమయంలో ర్యాంప్ వాక్‌లో భాగంగా తీసిన ఫోటోను ఇప్పుడు తప్పుగా అర్థం చేసుకుని వైరల్ చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలిసిన అభిమానులు మాత్రం ఈ రూమర్స్‌పై మండిపడుతున్నారు. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, ఇంతటి రూమర్స్, ట్రోలింగ్ జరుగుతున్నా అనుష్క మాత్రం ఎక్కడా స్పందించడం లేదు. తన వ్యక్తిగత జీవితంపై ఎప్పుడూ ప్రైవసీని కాపాడుకునే ఆమె, సోషల్ మీడియాలో కూడా చాలా తక్కువగా యాక్టివ్‌గా ఉంటుంది.

## ప్రభాస్ సినిమాపై కామెంట్స్..

## క్లారిటీ ఇచ్చిన రాశి..!



**వేద న్యూస్ డెస్క్:**

సీనియర్ నటి రాశి ఇటీవల చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వివాదానికి దారితీయడంతో ఆమె స్వయంగా స్పందించి పూర్తి స్పష్టత ఇచ్చారు. ప్రభాస్ సినిమాలో తాను తల్లి పాత్ర చేయనని చెప్పినట్టు ప్రచారం జరుగుతుండటం పూర్తిగా తప్పు అని ఆమె తెలిపారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకుని వైరల్ చేసినందుకు విచారం వ్యక్తం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న రాశి, ప్రభాస్ అంటే తనకు చాలా ఇష్టమని, ఆయనతో కలిసి పని చేసే అవకాశం వస్తే తప్పకుండా చేస్తానని చెప్పారు. అయితే ఆ సందర్భంలో తల్లి పాత్రపై తాను చెప్పిన మాటలను కొంతమంది వక్రీకరించారని ఆమె పేర్కొన్నారు. "నేను ప్రభాస్‌కు తల్లి పాత్ర చేయనని ఎక్కడా చెప్పలేదు. పాత్రకు తగిన ప్రాముఖ్యత ఉంటే ఏ రోల్ అయినా చేయడానికి సిద్ధమే" అని రాశి స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వివిధ రకాలుగా స్పందించారు. కొందరు ఆమెపై విమర్శలు గుప్పించగా, మరికొందరు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన 'అనుమాన పక్షి' సినిమా ఈవెంట్‌లో ఆమె ఈ వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాశి మాట్లాడుతూ, తాను గతంలో ప్రభాస్ సినిమాలకు డబ్బింగ్ చెప్పినా, ఆయనను వ్యక్తిగతంగా కలిసే అవకాశం రాలేదని తెలిపారు. భవిష్యత్తులో ఆయనతో కలిసి పని చేసే అవకాశం వస్తే ఆనందంగా స్వీకరిస్తానని అన్నారు. ప్రభాస్ లాంటి పెద్ద స్టార్‌తో స్క్రీన్ షేర్ చేయడం ప్రతి నటికి ఒక మంచి అవకాశం అని ఆమె అభిప్రాయపడ్డారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073